విన్నపము.*

ఎందుకీ కొత్త తెలుగు పత్రిక మరొకటి ? దేశములో కావలసినన్ని ఉన్నవే పత్రికలు, అనేక విధములయినవి; వాటివల్ల నెరవేరనివీ, దీనివల్లనే కాదగ్గవీ ఏమున్నది విశేష ప్రయోజనము ? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరము వివరించి మనవి చేస్తున్నాము. చదువరులు సావధానముగా పక్షపాతము లేక చిత్తగింతురుగాక !

నిజమే ; అనేక పత్రికలున్నవి; పత్రికాధిపతులూ సంపాదకులూ చాలా కష్టపడి, ధనము కర్చుపెట్టి జనులకు అనేకవిధాల ఉపకారము చేయడానికి ప్రయత్నము చేస్తున్నారు. వారి ఉద్దేశము దొడ్డదే. వారి ఉద్యమము కొనియాడదగినదే ; గాని, వారి ఉద్దేశము చక్కగా నెరవేరలేదనిన్నీ, వారి ఉద్యమము పూర్ణముగా ఫలించకుండా కొంతమట్టుకయినా వ్యర్థమవుతున్నదనిన్నీ మాకు తోస్తున్నది. ఇట్లే పుస్తకములు వ్రాస్తూఉన్నవారి ఉద్యమమున్ను సార్థకము కావడములేదు. వ్యర్థముగా ధనము వెచ్చించడమే కూడదని వ్యసనమంటారే; ధనముకన్నా ఎక్కువ విలువగల దేహబలము, బుద్ధిబలము వ్యర్థముగా వెచ్చించడము ఎంత కీడోగదా! కాశీకి వెళ్లదలచుకొన్నవారు పొగబండి—అందులోనూ మేల్ బండి—ఎక్కిపోక ఎడ్లబండిలోనో, కాక ఎక్కువపుణ్యమని కాలినడకనో ప్రయాణముచేస్తే, ఏమంటారు లోకులు! అర్జెంటా కవర్లలోపెట్టి పంపించవలసిన శుభలేఖలు కూలి మనుష్యుల చేతనో బ్రాహ్మణుల చేతనో పంపించి ఎక్కువ

---

* ఈ వ్యాసము మేము సనాతన సత్సంప్రదాయానుసారముగా వాడుకలోనున్న తెలుగు భాషలో వ్రాసినాము. ఈ సంప్రదాయము అనేక గ్రంథములలో కనబడుతున్నది. ఈ సంచిక లోనే మూడో వ్యాసములో దానికి ప్రమాణములు చూడనగును. ఇందులో మేమువాడిన శబ్దములు నూరేండ్లకు పైగా తెలుగువారిలో పెద్దలు వాడుతూ ఉన్నవే. (ప. సం.)

కర్చుపెట్టితే ఎక్కువ గౌరవము చేసినట్లా? కాగితము మీద ఊట కలముతో వ్రాసిన మంత్రముకన్న గంటముతో తాటాకుమీద వ్రాసినది శ్రేష్ఠమంటారా? లోక వ్యవహారములో తేట తెలుగున నలుగురూ వాడుకొనే మాటలతో చెప్పితే స్పష్టముగా బోధపడే విషయము వాడుకలో లేనిమాటలతో చెప్పితే వృథా ప్రయాసము కాదా? దానివల్ల ఏమయినా లాభమున్నదా? లేదని తెలిసినా చాలామంది వ్యర్థముగా తాము ఆయాసపడి చదివేవారిని ఆయాస పెట్టుతున్నారు. ప్రతి మనిషీ తన మనస్సులో తాను ఏ విషయమును గురించి అయినా ఆలోచించుకొన్నప్పుడు ఏదో ఒక విధముగా తనలో తానే మాట్లాడుకోక తప్పదు—తన మాటలు పైకి వినబడకుండా గొణగవచ్చును; ఒకప్పుడు విషయమందు మనస్సు లగ్నమై ఉంటే, తానుమాట్లాడుకొంటూ ఉన్నట్టు తనకు తోచకనే పోవచ్చును—అనగా భాషద్వారానేకాని పరామర్శ అసాధ్యము* ఆలోచించేటప్పుడు ఏ మాటలు వాడుకొంటారో ఇంచుమించుగా ఆ మాటలతోనే ఆ ఆలోచన పైకి తెలియచేయడము అందరికీ స్వభావము—సహజ ధర్మమువంటిది. మాటకూ మనోభావమునకూ గల సంబంధము చిన్నతనము నందే కలిగి అంతకంతకు దృఢపడుతుంది. ఈ ప్రకారము అలవాటయిన మాటలు మానుకొని వేరే మాటలతో భావమును చెప్పడము, ఎంతో కొంత ప్రయత్నము చేస్తేనేకాని, సాధ్యముకాదు. ప్రయత్నపూర్వకముగా మాట్లాడే మారుభాష స్వభాష అనిపించుకోదు. ఇగ్లీషుగానీ, సంస్కృతముగానీ మనము మాట్లాడగలిగినా అవి మన స్వభాషలు కానేరవు. వేదములోని

*"It (langauge) is essential to analytical thought. It is the material basis of classification; and classification is the formal basis of knowledge." *Payne. History of America Vol. II.*

భాష పాణిని కాలములో లౌకిక భాషకాదు. అట్లే నన్నయ తిక్కనాది కవులు వాడిన కావ్యభాష ఇప్పటి దేశభాషకాదు. అది పుస్తకములు చదువుకొంటేనేగాని రాదు. దేశస్థులతో సహవాసము చేయడము చేతనే అలవాటయేది దేశభాష. దేశభాషలో ఆలోచించిన విషయము వేరే మరిఒక భాషలో చెప్పడము భాషాంతరీకరణము. అన్యభాషలో విన్నది దేశభాషలోనికి మార్చుకొని భావమును తెలుసుకో వలెను. ఇట్లు చెప్పేవాడున్ను వినేవాడున్ను (వ్రాసేవాడున్ను చదివేవాడున్ను) ఉభయులూ భాషాంతరీకరణము చేసుకొంటేనే కాని ఒకరి భావములు ఒకరికి తెలియకుండా ఉండేటట్లు ప్రాచీన భాష వాడడమువల్ల లాభములేదు సరేగదా శ్రమ ద్విగుణమవుతున్నది. కావ్యములలో కవులు ఔచితినిబట్టి ఎట్టి శబ్దములు వాడుక చేసినా చెల్లునుగాని లోక వ్యవహారములోను, జనసామాన్యమునకు వ్రాసే గ్రంథములలోను చెల్లకూడదు.

ఈ పత్రికలో మొట్టమొదట చర్చించే విషయము వ్యావహారిక భాష, దాని ప్రవృత్తి, దాని ఉపయోగములు, దాని గౌరవము, దానిని ఉపేక్షించడమువల్ల దేశమునకు కలుగుతూ ఉన్న నష్టములు.

మే ము ఉ ద్దే శిం చి న ప్ర యో జ న ము :— ఇంగ్లండులో ఇంగ్లీషు, ఫ్రాన్సులో ఫ్రెంచి ఎట్లున్నవో—అట్లే తెలుగుదేశములో పెద్దలు నోటను వాడే నేటి తెలుగు భాషకు సాధ్యమయినంత దగ్గరగా తెలుగువ్రాత తెచ్చి నోటిమాటా, చేతివ్రాతా ఒకదాని కొకటి పోషకములుగా చేసి, రెండిటికీ సమముగా ప్రవృత్తి కలిగించి, వ్రాత సార్థకముగాను సులభముగాను చేసి, తెలుగువారు వ్రాసేదేకాక మాట్లాడేదికూడా సభ్యభాషే అనే గౌరవము దేశమునకు సంపాదించడము.

మా దృష్టిలో ఇదే వాస్తవమైన భాషాభిమానము.* మా ఉద్దేశము కొనసాగితే, పెద్దమనుష్యులు వ్రాసే సభ్యభాష దేశమంతా క్రమక్రమముగా వ్యాపించి విద్యాబోధకు కావలసిన సులభసాధన మేర్పడుతుంది. పామరులకు సులభమైన వాఙ్మయము పుట్టుతుంది. వక్తలకూ వాచకులకూ తగినభాష కుదురుతుంది. మనము ఇంగ్లీషు నేర్చుకొని వ్రాస్తూఉన్నట్టే మనదేశమందు కాపురమున్న ఇంగ్లీషువారున్ను ఇతరులున్ను మనభాష నేర్చుకొని మన భాషలోనే వ్రాసిగాని నోటను చెప్పిగాని మనకు హితోపదేశము చేయ వచ్చును. భాషలో ఐక్యమువల్ల దేశమునకు రాష్ట్రమునకు ఎంతబలము కలుగునో చరిత్ర చదివినవారికీ రాష్ట్రము ఏలేవారికీ తెలునును. వాడుకలో ఉన్న భాషవల్ల కలిగే ఇన్నిలాభములు విడిచి, వాడుకలో లేనిదీ, కొద్దిమంది పండితులకు మాత్రమే సాధ్యమయినదీ, ప్రాచీన భాష వ్రాతలలో వాడడము వ్యర్థప్రయాసము కాదా? ఈ ఆచారము ఏ దేశములోనూ లేదు; మన దేశమందయినా పూర్వము లేదు. మన తాతలనాడు లేదు. మన తండ్రులనాడు లేదు. ఈ ఒక్క తరములోనే ఈ వైపరీత్యము, ఈ ఉత్పాతము పుట్టినది. ఈ విషయము ముందు ముందు మేము విపులముగా చర్చించ దలచుకొన్నదే; గాని ఇక్కడ సూచనగా మాత్రము చెప్పినాము.

పత్రికలుగానీ, పుస్తకములు గానీ, వ్రాసేవారి ముఖ్యోద్దేశ మేమి? నోట మాట్లాడే వారి ఉద్దేశమే: తమ అభిప్రాయములు ఇతరులకు తెలియ జేయడము. మాట్లాడడము తమ ఎదుటనున్న వారికోసము. వ్రాయడము దూరముగానున్న వారికోసము. ఎవరి మట్టుకు వారు జ్ఞాపకముగా వ్రాసి

* వాడుకలోనున్న భాషను తృణీకరించి ప్రాచీనభాషను ఆదరించడము బ్రతికియున్నవారికి తిండిపెట్టక చచ్చినవారికోసము సంతర్పణ చేసినట్టుకాదా? ఆదికవులకు ఇట్టి దురభిమానముంటే తెలుగులో గ్రంథములే లేకపోవునుగదా?. మనపూర్వుల యెడల యెట్టిగౌరవ ముండవలెనో అట్టి గౌరవమే ప్రాచీనాంధ్రము సారస్వతముపట్ల ఉండవలెను. మాకు వాటియెడల చాలాభక్తికలదని వాటికి మేము చేసే ఉపచారమునుబట్టి లోకులు తెలుసుకోగలరు.

పెట్టుకోవడము కూడా గలదు. నోటి మాటకన్న చేతివ్రాత మేలయినది. నోటిమాట ఒక్కమారే వినబడును గాని చేతివ్రాత చాలామార్లు చూచి చదువవచ్చును. వ్రాత అనగా కాగితముమీద మాట్లాడడము. వ్రాసిన కాగితము ఒక విధమైన గ్రామోఫోన్ పలక. వ్రాసేవారు తమ నోటను పలికిన పలుకులే చదివేవారు తిరిగి తమనోటను పలుకుతారు. ఇదే నోటిమాటకూ చేతివ్రాతకూ గల సంబంధము. నోట పలికినదిగానీ, చేత వ్రాసినదిగానీ, ఏ మాటయినా భావమును బోధించుటకు సాధనమాత్రము. అది పాత్రవంటిది అన్నా అనవచ్చును. ఏదో పాత్రలోపోయక నీరు నిలవ నట్లు, మనోభావము ఏదోధ్వని ద్వారాగాని స్పష్టముగా తెలియదు. మనోభావమునకు ఆధారముగాను సంజ్ఞగాను ఉన్న ఈ ధ్వనికే గదా భాష అని పేరు. ఈ ధ్వనికి గురుతులు గదా వ్రాసిన అక్షరములు ! ఇతరులకు ఏ జ్ఞానేంద్రియము ద్వారా నయినా తెలియరాక నిగూఢముగా ఉన్న ఒకరి మనోభావముపైకి వినబడే ధ్వనులవల్ల తెలుపుడు కావడము చాలా విచిత్ర మయిన విషయము. అట్లే చెవికి వినబడే ధ్వనులకు కంటికి కనబడే గురుతులు వాడడము కూడా అద్భుతమైనదే. వాటి రహస్యము తత్త్వ వేత్తలు ఎరుగుదురు. దానిని గురించి మరొక్కప్పుడు విచారింతము గాని ఇప్పుడు అది అట్లుండనీయండి.

నాగరికత గల ప్రతిదేశములోను ఎక్కువ నాగరికత గలిగి పెద్దలని పేరు పొందినవారు నిత్యమూ వాడుకొనే భాష సభ్య మయినదనిన్నీ ఇత రులు వాడుకొనేది అసభ్యమైన దనిన్నీ ఎన్నిక చేయడము కద్దు. దేశ ములో నాగరికత వ్యాపించిన కొలదీ సభ్య భాషకూడా వ్యాపించి అదే సామాన్య భాష అవుతున్నది. ఇంగ్లీషువారిని గురించి, అంతో ఇంతో వారి భాషను గురించీ మన వారికి చాలా మందికి ఎంతో కొంత తెలును. ఫ్రెంచివారు, జర్మనులు మొదలయిన వారి భాషలను గురించి కూడా కొంద

రెరుగుదురు. వీరిలో పెద్దలయిన వారి వ్యావహారిక భాషే వారి దేశములో సామాన్యభాష; దేశభాష. అట్టిభాష మాట్లాడే వారందరూ అది వ్రాయ గలరు. వ్రాసే భాషకున్ను మాట్లాడే భాషకున్ను వ్యత్యాసము అట్టే ఉండదు. స్వీట్ పండితుడు చెప్పినట్లు 'వచనములోని భాష మాట్లాడే భాషకు దగ్గరగా ఉంటుంది' * ఔచిత్యము, పదములలోని కూర్పు, సొంపు—ఇవన్నీ రసికుల భాషలో-వ్రాసినప్పుడే కాక మాట్లాడి నప్పుడుకూడా—కనబడక మానవు. సామాన్యులు నేర్పులేక ఏదో ఒక విధముగా తమ అభిప్రాయములు చెప్పినా విభక్తులు, ఆదేశములు ఆగమములు, అనుబంధములు, శబ్దార్థములు, మొదలయిన వన్నీ పండితులు మాట్లాడే భాషకూ పామరులు మాట్లాడే భాషకూ సామాన్యమే.

లోక వ్యవహారములో పండిత పామర సామాన్యముగా అందరినోటను నలుగుడు పడుతూ ఉన్న భాష ఎంతో కొంత మార్పు పొందడము భాషకు సహజధర్మమే. ప్రాచీన పుస్తకములు చూచిన వారందరూ ఇది లెస్సగా ఎరుగుదురు. భాషా తత్త్వ మెరిగిన వారికి భాష మారడము వింతగా కనబడనే కనబడదు. మారకపోవడమే అసంభవము. ఇంగ్లీషుభాషకు వ్రాసినట్లే ఫ్రెంచి మొదలయిన భాషలకున్ను పండితులు భాషా చరిత్రములు వ్రాసి ఉన్నారు. భాషాచరిత్రమనగా భాషలో కలిగిన మార్పుల వృత్తాంతమే కదా. ఎప్పుడూ ఒక్కలాగున ఉండే భాషకు చరిత్రమే లేదు. వాడుకలో లేక గ్రంథములందు మాత్రమే నిలిచి ఉన్న భాషకు మరి మార్పు ఉండదు; మరి చరిత్రమూ ఉండదు. నిఘంటువులున్ను, వ్యాకరణములున్ను, వాడుకలో ఉన్న వ్యావహారిక భాషలకూ కావలెను; వాడుకలో లేని ప్రాచీన

---

* "The language of prose often approaches very closely to that of ordinary conversation." Sweet's English Grammar Vol. I.

భాషలకూ కావలెను. మొదటి వాటికి లక్షణము భాషతో కూడా మారుతూ ఉండవలెను; తక్కిన వాటికి లక్షణము స్థిరముగా నిల్చి ఉండవలెను. లాటిన్, సంస్కృతము మొదలయిన వాటి లక్షణము స్థిరమైనదే. ఇంగ్లీష్ భాషకు 1775లో జాన్సను పండితుడు వ్రాసిన నిఘంటువు ఇప్పుడు పనికిరాదు. వెబ్‌స్టర్ పండితుడు సుమారు నూరేండ్లక్రిందట వ్రాసిన ఇంగ్లీషు నిఘంటువు ఎన్నోసార్లు పునర్ముద్రితమైనది; అయినప్పుడెల్లా గ్రంథము సవరణకూడా అవుతూనే వచ్చినది. బెన్ జాన్సను (1600) మొదలయిన పండితులు వ్రాసిన ఇగ్లీషు వ్యాకరణములలోని లక్షణము ఇప్పటి ఇంగ్లీషుకు పట్టదు. ఎందుచేత? భాష మారినది గనక. *వైల్డు అనే పండితుడు చెప్పినట్లు వ్యాకరణము భాషకు ఆధారము కాదు: భాషే ఆధారము వ్యాకరణమునకు. 'పూర్వకాలమందు జనులు ఈ ప్రకారము మాట్లాడే వారు. గనుక ఇప్పుడు కూడా జనులు అట్లే మాట్లాడవలెను.' అని నియమించేవాడు మంచి శాస్త్రకారుడు కాడు. ఎందుచేత నంటే భాష ఎల్లకాలమూ ఒకటే తీరున ఉండదు; మారుతూ ఉంటుంది; మార్పువల్ల కీడుకానీ, మేలుకానీ, మారినదేమో మారినదే; అనివార్యమూ. ఆ మార్పు గ్రహించి, యథాశక్తి, తన కాలమందు వాడుకలో ఉన్న సభ్య భాష ఎట్లుంటే అట్లే పాటించవలెను శాస్త్రకారుడు.

---

* Grammarians do not lead speech; they follow it. If a grammarian said, 'This is the way people used to speak in times past, therefore this is the way people ought to speak now, he would not be a wise or good grammarian, because a language is not the same at all times; and if it has changed well it has changed, for better or for worse, and all that the grammarian has to do is to accept the fact and describe the best usage of his time to the best of his ability' *Wyld.*

ఇట్లు అన్ని దేశములలోనూ తాత్కాలికముగా పెద్దలు వాడుకొనే భాషకే లోకమందు ప్రవృత్తి కనబడుతున్నది గాని ప్రాచీన గ్రంథములందే నిల్చి వాడుకలో లేని భాషకు గాని శబ్దములకు గాని విభక్తులకు గాని ప్రవృత్తి కానరాదు. నేడు ఇంగ్లీషు వారిలో తగు మనుష్యులు సభలో సంవాదము చేస్తూ ఉన్నప్పుడు గాని న్యాయసభలో న్యాయవాదులు ధర్మ ప్రదర్శనములు చేస్తూ ఉన్నప్పుడు గాని, బడిలో ఇంగ్లీషు పండితులు శాస్త్ర ప్రసంగములు చేస్తూ ఉన్నప్పుడు గాని, వారి నోటను వచ్చే వాక్యములు కాగితము పైని వ్రాస్తే వాటిలోని భాషకున్ను గ్రంథములలోని భాషకున్ను వ్యత్యాస ముండదు; ఉన్నా అత్యల్పము. అంతమాత్రాన అవి వేరు భాషలు కావు; మొత్తముమీద రెండూ ఒకటే భాష.

ఇంగ్లండులో ఉన్నట్లే ఇతర దేశములలోను వ్రాయడమునకున్ను మాట్లాడడమునకున్ను ఒకటే భాష ఉన్నందున అనేక తరముల నుండి సభ్యము కాని ఉప భాషలు * మాట్లుడడమునకు అలవాటు పడ్డవారు సయితము ఇప్పుడు పెద్దల సహవాసము వల్లను, చదువు వల్లను, సభలకు వెళ్ళుటవల్లను, క్రమక్రమముగా పెద్దలభాష నేర్చుకొనడమునకు వీలు కలుగుతున్నది. అందు చేత పూర్వకాలమునందు ఉపభాషలకున్న అల్ప ప్రవృత్తికూడా రానురాను తగ్గిపోయినది; వాటిలోనివి కొన్ని. అంతరించినవి. ఇప్పుడు పెద్దల భాషే దేశమంతా అల్లుకొంటున్నది. భాషవల్ల జనులలో పరస్పర సంబంధమూ దృఢ పడుతున్నది. భాష సామాన్యమైనప్పుడు పుస్తకములు సామాన్యమూ కావా? అందువల్ల జ్ఞానము సామాన్యము. భావములు సామాన్యము. అందుల ఫలమూ సంఘమునకు ఐకమత్యము.

ఇంతేకాదు, నోటిమాటకు చేతి వ్రాతకు సామ్యమున్నందువల్ల లాభము, ఒక దేశమువారు మరి ఒక దేశభాషను నేర్చుకొనుట చాలా

---

* Provincial dialects.

సులభముగా ఉంటుంది. మాటకు, ఇంగ్లీషు వారిలో అనేకులు ఫ్రెంచి జర్మన్, ఇటాలియన్ పోర్చుగీసు, స్పానిష్ మొదలయిన యూరోపియన్ భాషలు అన్నీగాని కొన్నిగాని అవకాశము కొలదీ నేర్చుకొన్న వారున్నారు. మన చక్రవర్తిగారికి ఎన్నో భాషలు వచ్చునట. స్వదేశ భాషవలెనే స్వేచ్ఛగా తడువుకోకుండా వారు ఇతరదేశభాషలు మాటాడగలరు; వ్రాయగలరు. ఇతరులతో సహవాసము చేయడముచేతను, వారి భాష నోటను తరచుగా మాటాడడము చేతను, ఆభాషే గ్రంథములలోను వార్తాపత్రికలలోను కంటితో చూచి చదవడము చేతను— ఇట్లు చెవికి, నాలుకకు, కంటికి, చేతికి కూడా అలవాటయి వ్యత్యాసము లేకుండా ఏకరూపమయిన భాష మనస్సులో నాటుకొంటున్నది. లోకవ్యవహారమందు ప్రవృత్తి లేక గ్రంథములందే ఉన్న భాషను దాని లక్షణమంతా వల్లించినా వాడుక చేయడము సులభము కాదని అందరికీ తెలిసిన విషయమే. సంస్కృత వ్యాకరణమంతా కంఠ పాఠము చేసిన వారందరూ స్వేచ్ఛగా లౌకిక వ్యవహారమును గురించి సంస్కృతమున మాట్లాడలేరు, వ్రాయనూలేరని చెప్పవచ్చును. మన దేశమందు వేలకొలది హిందువులు హిందూస్తాని భాష మాట్లాడగలరు. అనేకమంది అరవలు తెనుగున్ను, అనేక మంది తెనుగులు అరవమున్ను స్వేచ్ఛగా మాట్లాడ గలరు. తడువుకోకుండా అన్యభాషలు మాటాడగలిగిన స్త్రీలను చూచినాను ఎంతో మందిని—ఒక్క అక్షరమైనా వ్రాయలేని వారిని. వేరువేరు భాషలు రెండు మాట్లాడే జనులు ఎక్కడ కలిసి ఉంటే అక్కడ రెండు భాషలకూ ప్రవృత్తి కలిగి చాలా మందికి రెండు భాషలూ అలవాటు కాగలవు.

ఇది మన మందరమూ ఎరిగిన విషయమే. వాడుకలో ఉన్న భాషే వ్రాతలో కూడా పెట్టితే, అక్షరములు మాత్రము నేర్చుకొంటే చాలును, ఎవరయినా ఆ భాష చదువవచ్చును; వ్రాయవచ్చును. యూరపులోని

భాషలు. ఆలాగు ఉండబట్టే కదా ఇప్పుడు వేయిమందికి ఒకడయినా అక్కడి జనులలో చదువు రానివాడు లేడు. స్త్రీలలో గానీ; పురుషులలో గానీ, మన దేశమందు తెలుగుభాష గతి ఎట్లున్నదో చూడండి. లోక వ్యవహారమందు పెద్దలు అందరూ నోటను మాట్లాడేది ఇంచుమించుగా ఒకటే భాష అయినా, ఉత్తర ప్రత్యుత్తరములలో ఆ భాష అందరూ—పండితులు కూడా—వాడుతూ ఉన్నా 'గ్రంథము' లన్న వాటిలోను, వార్తాపత్రికల లోను, ఆభాష బుద్ధిపూర్వకముగా మానుకొని ఏదో కృత్రిమ భాష, లోకములో ఎక్కడా ప్రవృత్తి లేనిది, (కొన్ని నేటివీ, కొన్ని మొన్నటివీ, కొన్ని కొత్తవీ, కొన్ని పాతవీ, కొన్ని ఎన్నడూలేక విశ్వామిత్ర సృష్టిలో పాడచూపినవీ—అన్నీ చేరిన'భాష') ఏవరికి తోచినట్లు వారు కల్పించి వ్రాస్తున్నారు. ఇటుపయిని ప్రకటించే పత్రికలలో ఈ కృత్రిమ గ్రాంథిక భాష విమర్శించడమునకు ఉద్దేశించి ఉన్నాము గనుక ఇక్కడ దానిని గురించి విస్తరించి చెప్పము. తెలుగువారిలో నాగరికులు స్వదేశభాష వ్రాయలేరన్నమాట యూరపులో వింతగా ఉంటుంది. నాగరికులు స్వదేశభాష మాట్లాడలేరంటే యూరపులో నవ్వుతారు పిచ్చిమాటని. మన తెలుగువారిలో తగు మనుష్యులే సిగ్గుపడకుండా అంటారు; "మేము తెలుగు మాటాడలేము. మాలో పండితులైనా మాటాడలేరు" అని. వాస్తవముగా వారు వ్రాయలేనిదీ, మాటాడలేనిదీ ప్రాచీన భాషగాని ఇప్పటి భాష కాదు. నాగరికులైన ఇంగ్లీషు పండితులుగాని ఫ్రెంచి పండితులుగాని తమ దేశపు ప్రాచీన భాషలు మాటాడనూ లేరు. వ్రాయనూ లేరు.

కొంతకాలము క్రిందట మన దేశములో సంస్కృతము వలెనే యూరపులో లాటిన్ గ్రీక్ భాషలు ఎవరో కొందరు యావజ్జీవము వేరేపని లేకుండా అభ్యసించి పండితులయి చాలా గౌరవము పొంది, ఆ భాషలో ఉన్న ప్రాచీన గ్రంథరాజములు చదివి వాటి అర్థమును దేశభాషలలో జను

లకు బోధించేవారు. సాధారణముగా 'గ్రంథము' అనేది వ్రాయడమునకు ఆ ప్రాచీన భాషలే యోగ్యమయినవని అనుకొనేవారు. కొందరు బుద్ధిమంతులు మాత్రము అప్పుడప్పుడు అక్కడక్కడ లేచి వాడుకలో ఉన్న దేశభాషలలో కొన్ని గ్రంథములు వ్రాసి గురు శుశ్రూష చేసిన జనులకు కొన్ని విద్యలు చెప్పుతూ వచ్చినారు. ప్రాచీన భాషా పండితులు ఇట్టివారిని చూచి ద్వేషించేవారు. మతగ్రంథములు—బైబిలు—దేశభాషలలో వ్రాయ నిచ్చేవారు కారు. అట్లు వ్రాయడానకు ప్రయత్నించిన వారిని వెలివేసి కఠినముగా దండించేవారు. తర్కశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము మొదలయిన శాస్త్రము లేవిన్నీ దేశభాషలలో వ్రాసేవారుకారు. అట్లు వ్రాస్తే తమ మాహాత్మ్యము, తమ శాస్త్రముల మాహాత్మ్యము పోవునని భయపడేవారో ఏమో! మొత్తానకు దేశభాషలు దిక్కు మాలినవిగా ఉండేవి. యూరపు దేశస్థులు ఇప్పుడు తమ దేశభాషలే ఎక్కువగా అభ్యసించి ఆదరిస్తున్నారు. అట్లే మన తెలుగుభాషకూడా సంస్కృత పండితుల దృష్టికి నీచభాషగా ఉండేది. ఇప్పటికీ ఉన్నదని చెప్పవచ్చును. సంస్కృతము ముందర ఇట్టి దేశభాషలు అపభ్రంశములు, గ్రామ్యాలు * వీటిలో గ్రంథములు వ్రాస్తే నరకములో పడతారట! ఇట్టి భావములు గల పండితుల మాట తిరస్కరించి కొందరు దేశ భాషాభిమానులు, రసికులయిన వారు తమ వేష దేశభాషలయందు అభిమానముగలవారై వైకృత భాషలలో వ్రాసిన గ్రంథములను మెచ్చుకొంటారని తెనుగునకు గౌరవము సంపాదించినారు. † అట్టివారు ఎంత ఉదారవంతులో కదా!

వారి ఉద్దేశ మేమి? సామాన్యజనులు సంస్కృత భాష పూర్ణముగా అభ్యసించలేరు. ఆ భాషలో సంపూర్ణ పాండిత్యము కలిగితేనే కాని

---

* "అపభ్రంశం ప్రయుంజానా నరకం యాంతిమానవాః—

† "స్వస్థాన etc., ఆంధ్ర శబ్ద చింతామణి.—

అందులో ఉన్న గ్రంథములు చదువుకొని అర్థం చేసుకోవడ మసాధ్యము. జ్ఞానము వల్లగాని మనుష్యులు వృద్ధి పొందలేరు. జ్ఞానము కలుగడానకు ఏ భాష అయితే నేమి? పరిచయముగల భాషలో బోధించినది తెలుసు కోవడము సులభము గనుక అపభ్రంశ మన్నాసరే * గ్రామ్యమన్నా సరే, వైకృత మన్నా సరే, మ్లేచ్ఛమన్నా సరే † లౌకిక భాషలోనే కావ్యములుకూడా వ్రాయవచ్చును. కావ్యమనగా రసవంతమైన వాక్యము. రసమునకు ప్రధాన మైనది శబ్దము కాదు; శబ్దార్థము. మాట అనీ అనడము తోనే రసము స్ఫురించితేనే కాని ఆనందము కలుగదు; శృంగారరసము కానీ, భక్తిరసము కానీ. అట్టి స్ఫురణ వాడుకలో ఉన్న మాటల వల్లనే కలుగుతుంది—ఇదీ ఆ మహాత్ముల ఉద్దేశము. ఈ ఉదారభావమే కర్పూర మంజరిలో రాజశేఖర కవి తెలియజెప్పినాడు. నాటకమంతా (ఉత్తమ పాత్రల వాక్యములుకూడా) ప్రాకృతములోనే రచించి, అట్లు రచించినం దుకు, 'సంస్కృతభాష మగవానివలె మోటుగా ఉంటుది; ప్రాకృతమైతే సుందరివలెనే సుకుమారమైనది. స్త్రీ పురుషుల కెంత భేదమున్నదో అంత భేద మున్నది పాకృతమునకున్ను సంస్కృతమునకున్ను; ఉక్తి విశేషము కావ్యము; వట్టి శబ్దములు కావు; భాష ఏదైతే అదే కావచ్చును' అని సమాధానము చెప్పినాడు.

ఇట్లే తన ఆంధ్రభాషార్ణవములో కోటి వెంకనార్యుడు "దేవతల భాషగావునఁ దెలుగుకన్న। సంస్కృతము మిన్నయాయుక్తి సరియె తెలిసి। రసికుఁడగు వాఁడు తనదుజాలుసికలో న। దులసినే యిడుకొనునో జాదుల నెయిడునో?" అని 'సంస్కృతము తులసివంటిది; తెనుగు జాజిపువ్వులవంటిది'

---

* "అప్పకవీయము. (సరస్వతి శాల్య భాష.)

† క్షితిమ్లేచ్ఛ......వ్యవహారహాని సంధిలుకతనజ—విడువగూడదు.
అప్పకవీయము 1-169.

అన్న భావము తెల్పినాడు. తెలుగువారికి తెలిసిన తెనుగుమాటలచేతనే రసస్ఫూర్తి కలుగునని ఒప్పుకొన్నాడు; "కానని యాంధ్రకృతులందుఁ గలుగు నట్టి । పదములకు నెల్ల నర్థమేర్పడెడురీతి । నద్భుతంబుగఁ గృతిని జేయంగ వలయు । నర్థమైన రసస్ఫూర్తి యగుట యరుదె? ||'

జనులందరూ ఏక కుటుంబములోని వారని ఎన్నుకొని జాతిభేదములు పాటించకుండా ప్రవర్తించే ఉదార చరితుల వలెనే, భాషలన్నిటికీ ప్రయోజనము ఒకటే అని తెలుసుకొని, ఏభాష ఎవరికి సుపరిచితమో వారికి ఆ భాషే జ్ఞానసంపాదనమునకు, జ్ఞానదానమునకు యోగ్యమైనదనిన్నీ తెలియని భాష ఎంత ప్రాచీనమైనా నిరర్థక మనిన్నీ దూర దృష్టిగల లోకజ్ఞులు అంగీకరిస్తారు. తాతగారు తవ్వించిన నూయి అని ఉప్పు నీళ్ళైనా తాగేవారు కాపురుషులటగదా! ఎవరైతే నేమి? తమకు హితమైనదే లోకానకంతా హితవు కాక తప్పదనుకోవడము వివేకము కాదు.

'కొన్ని జీవులు చిదిపి జాల్గొటికి బ్రిదుసు। కొన్ని మనసోఁగ వెన్నెలల్ గ్రోలి పొదలు । భిన్నరుచులైన వానికిఁ బ్రీతి సరియ । తగవుగా దిందులో ననేకతర గర్వ' * అని దమయంతి తనకు ఇష్టుడు నలుడేకాని సురపతి అయినా ఇంద్రుడు కాడని చెప్పినట్లు తెలుగు వారు తమ భాషయందభిమానము కలిగి ఉండడము తప్పుకాదు. పూర్వ కవులు వాడినదైనా ప్రాచీనాంధ్రముకన్న వర్తమానంధ్రభాషే సుపరిచితమైనది గనుక దాని యెడల ఎక్కువ ఆదరము చూపడము దోషముకాకూడదు; మెచ్చదగినదే కావలెను. 'దప్పిగొన్నట్టి వారికా దప్పిదీఱ । సలిలపూరంబు హితవొ? యాజ్యంబు హితవొ?' అన్న కవి హృదయము స్పష్టము. తిక్కన కవి కూడా తనకాలమందు నాడుకలో ఉన్న తెలుగును ఆదరించి పాత తెలుగును ఎట్లు నిరసించినాడో చూడండి.

* శ్రీ వే వేంకటరాయశాస్త్రి గారు పరిష్కరించిన పాఠము; గాని నాల్గవ చరణమున యతి భంగము. మావద్దనున్న తాటాకుపుస్తకములోని పాఠము:-'తగవుగా దిందులో నేకతరవిగర్వ'

చ॥ పలుకుల పొందులేక రసభంగము సేయుచుఁ బ్రాత వడ్డ మా
టలఁ దమ నేర్పుఁజూపి యొకటన్ హృదయంబలరింప లేక యే
పొలమును గాని యట్టి క్రమముం దమ మెచ్చుగ లోకమెల్ల న
వ్వులఁ బొరయం జరించు కుకవుల్ ధర దుర్విటులట్ల చూడఁగన్॥

పాత మాటలలోనే మాహాత్మ్యమున్న దనుకొన్న వారు, అనన్య సామాన్య భాషా వైదుష్య గరిష్ఠులు, 'ఆంధ్ర భాషామయం కావ్య మయో మయ విభూషణం గీర్వాణారణ్య సంచార విద్వన్మత్తేభ శృంఖల'మ్మని చెప్పదగిన కావ్యములు రచించుకొని, తమ మాటలు పండితుల కయినా తెలియకుండా చదువుకొని కావ్యరసము జుర్రుకొందురుగాక! రసజ్ఞులయిన కవులు మాత్రము అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కూడా యథోచితముగా సరి క్రొత్తమాటలతో పొందించి వివిధములయిన కావ్యములు వ్రాస్తూనే ఉన్నారు. రామభద్రుడు సకలకథాసారసంగ్రహమందు:

ఉ॥ నన్నయ తిక్కనాది కవినాథులు చెప్పిన యట్ల చెప్ప లే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరక యుండిరె? తోఁచినట్లు ని
త్యోన్నత బుద్ధిఁ గబ్బములు యోజ రచింపక యందు జ్ఞాన సం
పన్నుల కావ్యముల్ హరి సమర్పణమై, చెలువొందు నెందునున్॥

అని ఉత్తరాంధ్రకవుల కావ్యములకు గౌరవము లేదన్న వారికి ప్రత్యుత్తరముగా చెప్పినాడు. ఈతని తాత వాడుకమాటలతో చెప్పిన ఒంటిమెట్ట రఘువీర శతకమును ఆకాలమువారు మెచ్చుకొన్నారట! భాషలో అపశబ్దము లున్నా, సువ్యక్తమై భావము మంచి దైతే చాలును. 'చెరుకునకు వంకబో తేమి చెడునె తీపు?' అని శేషప్ప అన్నట్లె

మ॥ అపశబ్దంబులఁగూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపా
ప పరిత్యాగము సేయుఁగావున హరిన్ భావించుచున్, బాడుచున్,
జపముల్ సేయుచు, వీనులన్ వినుచు, నశ్రాంతంబు గీర్తించుచున్,
దపసుల్, సాధులు ధన్యులౌదురు గదా తత్వజ్ఞ చింతింపుమా.

అని భాగవతోత్తముడైన బమ్మెర పోతరాజు చెప్పిఉన్నాడు.

రసవంతమైన కావ్యములు రచించిన వారందరిని లాక్షణికులు ఎందుకో ఒకందుకు నిందించడము అరుదుకాదు. కుకవుల నింద మామూలేకదా. రసికులయినవారు పిచ్చులచ్చనాలు పాటించ లేదు. వాస్తవముగా కవులు స్వేచ్ఛా విహారులు. వారి రుచే వారికి ప్రమాణము. వారికి శబ్ద సిద్ధి లోకము వల్లనే తెలుస్తుంది. వారి ప్రయోగములే లక్షణమునకు లక్ష్యములు. అన్ని దేశములలో కవులకు ఈ అధికారము, ఈ స్వేచ్ఛ ఉచితమైనవని అంగీకరించినవే. ఏ కవి ఇతరులు చెప్పిన లక్షణమునకు భయపడి తన మతము మార్చుకొంటాడో ఆ కవి అస్వతంత్రుడు; అతని కవిత్వము అతనిది కాదు; అతని వన్నీ ఎరవే; పంజరములో రెక్కలు కత్తిరించి పెట్టిన చిలక లాగున 'కృష్ణతాతా-తోటకూరా' అని పలక వలసిన వాడే కాని యథేష్టముగా వనమందు విహరిస్తూ కూజించే కోకిల వలె పాడలేడు. అందుచేతనే, సహజమైన రీతిని పదములు కూర్చితే కవిత సొంపుగా ఉంటుందిగాని మాసికలు వేస్తే ఉండదు.

మ॥ చతురుల్ పూర్వ కవీంద్రు లన్నిటను; నే స్వల్పజ్ఞుడన్ స్వాకిమిన్
హితమో కాదో మదీయ కావ్యమని నాకేలా విచారింప; న
గ్రతనూజుల్ వ్యవహార కర్తలయినంగానీ, కడుంబాలుఁడౌ
సుతు నవ్యక్తపు మాట తండ్రి కొదవించున్ గాదె యానందమున్॥

అని అబ్బయామాత్యుడు చెప్పినాడు. అతడే లాక్షణికులను పరిహసించి సరస్వతి తనకు నేర్పిన మాటలనే వాడుతానని:—

ఉ॥ చెల్లునటంచు నొక్క కవి చేసిన లక్షణ మొక్క రివ్వలన్,
జెల్లమిఁ జేసి తా రొకటి చెప్పగ ఛాందసవిస్తరంబు సం
ధిల్లుటఁ గావ్యశంక లవనిం దఱుచయ్యె రసజ్ఞులార! నా
యుల్లపు సౌధవీధిఁ గొలువున్న సరస్వతి సత్యవాణి నా
తల్లి యొసంగు పల్కులివి తప్పులు చేయక చిత్తగింపుడీ॥

అని కవిరాజ మనోరంజనములో వ్రాసినాడు. ప్రాచీన లక్షణమే పరమ ప్రమాణముగాను ప్రాచీన భాషే శిష్ట భాషగాను ఎన్నుకొని, పాత కంపే తమ కింపుగా వ్రాయడము ఎంత ప్రమదముగా ఉన్నా, సరస కవులు కొందరువాడుక మాటలకు కావ్యములందు ప్రవృత్తి కలిపిస్తున్నారు. ఇత రులు ఆక్షేపిస్తే వారు భయపడరు. చూడండి ఏమంటున్నారో నేటి కవులు కొందరు.

ఉ॥ కాలముఁబట్టి దేశమును గాంచి ప్రభుత్వము నెంచి దేశ భా
షాలలితాంగి మాఱుటది సత్కవి సమ్మతమాట, నన్య దే
శ్యాలును నాంధ్రభాషఁ గలపోటను, నౌచితిఁబట్టి మేము క
బ్బాలను వాడుచుంటి మవి పండితు లేగతి నొప్పకుందురో !

సెబాష్! తిరుపతి వెంకటేశ్వరకవులు! మీరు నిజమైన ఆత్మ గౌరవము గల కవులు! ‘కాలము, దేశము, ప్రభుత్వము, భాష—మారక తప్పదు; అన్యదేశములతో సంబంధమున్నప్పుడు అన్యదేశ్యాలు భాషలో చేరక మానవు. ఔచిత్యము, అనౌచిత్యము, ఏర్పరించడములో కవి హంస వంటివాడు. తన అంతఃకరణ ప్రవృత్తే కవికి ప్రమాణము.’ ఎంతచక్కగా చెప్పినారు!

ఈకవుల కావ్యములను విమర్శించినవారు శబ్ద రత్నాకరమును బట్టీ, చిన్నయసూరి వ్యాకరణమునుబట్టీ, తప్పులెన్నినప్పుడు, పంచాంగములో చెప్పకపోతే ఆకాశముమీద నక్షత్రాలుండరాదా అనీ, ప్రయోగమూలక వ్యాకరణము గనుక ప్రయోగమే ప్రమాణమనీ, సిద్ధిర్లోకాద్వ్యశ్యా అనీ, నిరంకుశాః కవయః అనీ, సమాధానము చెప్పినదే కాక,

క. వ్యాకరణ మొక్కత్రోవ, మహాకవు లొకత్రోవ, కోశ మఖిలమ్మొక
త్రోవై కనుపట్టెడి నీ భాషా కావ్యమ్ములను దలఁచు చదివిన కొలదిన్.’

'క. తొలిబాసయందుఁ బలె నీ తెలుగుంబాస వెలయించు దీపములేమిఁ
విలువగల కవుల లక్ష్యమ్ములె తా మీ భారమెల్ల మోయఁగవలయుఁ.'

అని తమ గ్రంథములలో స్పష్టముగా తమ ప్రమాణము విశదపర్చినారు.

మాకు వీరే మార్గదర్శులు. కావ్యభాషలో శబ్దముల సాధుత్వా సాధుత్వములు నిర్ణయించడానకు కవుల ప్రయోగములే ప్రమాణము * ఈ ప్రయోగములు లక్ష్యముగా చేసుకొని వాటికి విరోధము రాకుండా లాక్షణికులు లక్షణము చెప్పవలెను. ఈ లక్షణశాస్త్రము భాషావిషయములో కవికి సంకెళ్ళు వేయడమునకు అధికారము కలదికాదు; పూర్వకవుల వాడుకకు జ్ఞాపకమాత్రము; ఆ విషయములో కవికి లోకమే ప్రమాణము. ఔచితినిబట్టి ప్రాచీన శబ్దములూ, నవీన శబ్దములూ, దేశ్యాలూ, అన్యదేశ్యాలూ యథేష్టముగా వాడవచ్చును కవి. ఈ ప్రకారముగానే ఏకాలములందున్న కవులు ఆ కాలమందు లోకములో ఉన్న భాషారూపములు వాడి ఉన్నారు. కావలసినన్ని శబ్దము లట్టివి ఉదాహరించవచ్చును. ఇట్టి శబ్దములు అనేకములు కవిప్రయోగరూఢములని ఎరుగక కేవలగ్రామ్యము లనుకొని వ్యావహారిక భాష అపభ్రంశమనిన్ని, గ్రంథములందు ప్రవృత్తి లేనిదనిన్ని బాలులు, బాలికలు, భ్రమపడేటట్టుగా డాంబికులు తాము వాడడము మానివేసి, ఇతరులు వాడితే ఆక్షేపిస్తూ ఇప్పుడేదో గ్రాంథిక భాషట వ్రాస్తున్నారు. ఈ పత్రికలో వచ్చేనెలనుండి ఇట్టి శబ్దములు విమర్శించి, వాటి ప్రయోగములు మాకు చిక్కినన్ని చూపించి, వాటిసాధుత్వము సిద్ధాంతము చేయ నుద్దేశించినాము. అనేకగ్రంథములు చదివిన పండితుల సహాయము లేనిదీ ఈ ఉద్యమము బాగుగా నెరవేరదు గనుక అట్టివారు మాకు తోడ్పడుదురుగాక.

---

* చూ. కొవ్వూరి సారస్వత మహాసభవారి తీర్పు. (మూడవ వ్యాసము).

గ్రాంథిక భాష అనేది క్రొత్తపేరు. అది ఏదయినా గ్రంథములలోనిది గదా కావలెను. తెలుగు గ్రంథములు అనేక విధములుగా ఉన్నవి. వీటి లోని భాష ఒక్కలాగుండదు. కొన్ని (క) ఛందోబద్ధములు; కొన్ని (గ) కేవల వచనములు. ఛందోబద్ధములయినవాటిలో కొన్ని (1) ప్రబంధములు, పురాణములు, ఇతిహాసములు, మొదలయినవి; కొన్ని (2) శతకములు, కొన్ని (3) ద్విపదలు, రగడలు; కొన్ని (4) కళికలు, ఉత్కళికలు; కొన్ని (5) పాటలు, పదములు, కృతులు, కీర్తనలు, జావళీలు మొదలయినవి; మరికొన్ని (6) దండకములు మొదలయినవి—ఇట్లు వివిధముగా ఉన్నవి. వచనములు కూడా నానారూపములుగా ఉన్నవి. కొన్ని (1) చంపూకావ్యములలో మధ్య మధ్యను ఉన్నవి; కొన్ని (2) అప్పకవీయము, బాలసరస్వతీయము మొదలయిన లక్షణ గ్రంథములలోని 'అవతారిక' 'తెలివిడి' 'వివరణము' 'టీక' అనే పేళ్ళు గలిగి ఉన్నవి; కొన్ని (3) సంస్కృతాంధ్ర కావ్యములకు నిఘంటువులకున్ను తెలుగు టీకలుగా ఉన్నవి; కొన్ని (4) వైద్యము; జ్యోతిషము, గణితము; సంగీతము, అభినయము, మొదలయిన శాస్త్రముల వివరణము; కొన్ని (5) వేదాంత విషయకోపన్యాసములు; కొన్ని (6) స్తోత్రములు; కొన్ని (7) రాజశాసనములు; కొన్ని (8) కథలు, ఆఖ్యాయికలు, క్షేత్ర మాహాత్మ్యములు.

ఇవి అన్నీ గ్రంథములే గదా! వీటిలోని భాషగదా గ్రాంథిక భాష అనవలెను. ఇవి అన్నీ వివేచనతో పరీక్షించి చూచినమొదల ప్రబంధము లందు మాత్రమే వ్యావహారిక భాషకు భిన్నరూపముగా ఉన్న ప్రాచీనభాష ప్రచురముగా కనబడును; వీటిలో అయినా ఆయా కవులు తమతమ ఇష్టానుసారము ఉత్తరాంధ్రభాషా రూపములు, విరళముగా కొందరు, ప్రచురముగా కొందరు, వాడిఉన్నారు. ఛందోబద్ధములయిన తక్కిన గ్రంథములలో- వేరుమాట—కవులు నిరాటంకముగా వ్యావహారిక భాష ఆదరించినారు

ప్రబంధమువలెనే శతకములు వ్రాసినవారు కొందరున్నా, పాటలు మొద
లయినవి మాత్రము పూర్వులందరూ సరసముగా వాడుకమాటలతోనే కూర్చి
నారు. ఈ పాటలు ఛందోబద్ధములు కావా? ఆ పాటలు రచించినవారు
కవులు కారా? త్యాగరాయలను వారి కృతులను తలచుకోండి. ఇక వచన
ములమాట చెప్పుతాము. చంపూకావ్యములలో అక్కడక్కడ ఉన్న
'వచనములు' మాత్రము వాటిలోని పద్యములవలెనే ప్రాచీన భాషా
మయమయిన కావ్యభాషలో వ్రాసిఉన్నవి. తదితరమైన వచనగ్రంధమేది
చూచినా వ్యావహారిక భాషలోనే ఉన్నది. పద్యకావ్యమువలెనే కేవలము
కావ్యభాషలోనే రచించిన వచనగ్రంథము నిజమయిన తెలుగు దేశములో
మాకు ఎక్కడనూ కనబడలేదు. తంజావూరు మొదలుకొని గంజాం జిల్లా
లోని ఛత్రపురము వరకూ ఏయేచోట్ల తాటాకు పుస్తకములున్నవని మాకు
తెలిసినదో ఆయాచోట్లకు పోయి అవి చూచినాము. ఆంధ్రసాహిత్య
పరిషత్తువారు సంపాదించిన తాటాకుపుస్తకములలో నాలుగయిదు కాబోలు
ఉన్నవి, అంతే, కావ్యభాషలో రచించిన వచనగ్రంథములు. వాటిలో
జైమిని భారతము మాత్రము నిరుడు పరిషత్తువారు అచ్చువేయించినారు.
కొన్నిటికి ప్రతులు చన్నపట్టణము గవర్నమెంటువారి గ్రంథాలయమందున్నూ,
తంజావూరి గ్రంథాలయమందున్నూ ఉన్నవి; మరియెక్కడనూ మాకు కాన
రాలేదు. ఈ అద్భుతవచన గ్రంథములు రచించిన వారెవరో తెలుసు
కొంటే, ఎందుచేత అట్టి అద్భుతవచనము వారు రచించినారో ఊహించ
వచ్చును. మ. రా. రా. జయంతి రామయ్యపంతులుగారే ఒకపుస్తకములో
* "తంజావూరు, తిరుచునాపల్లి, మధుర— ఈ రాజ్యములు పాలించిన
'నాయక' రాజుల కాలములో ఇవి పుట్టినవి. ఇవి మొన్న మొన్న దొరకి
నవి. ఇంతవరకూ ఈ గ్రంథములున్నవని ఎవరూ ఎరుగరు. ఇప్పటి గ్రాం

* Defence of Literary Telugu. P. 2.

థిక వచనమునకు చెన్నపట్టణములో ఉండిన చిన్నయసూరిగారే బ్రహ్మ.” అని వ్రాసినారు. బాగా ఆలోచించండి. తంజావూరు, తిరుచునాపల్లి, మధుర, చన్నపట్టణము—ఇవి అరవ దేశములోనివి. అక్కడ కాపురముండిన తెలుగులు ఎట్టి తెలుగున సంభాషింతురో వారితో మాట్లాడిన వారికి గాని తెలియదు. చన్నపట్నము మొదలుకొని రామేశ్వరము వరకూ ఉన్న పెద్దపట్టణములలోఉన్న తెలుగువారిని కొందరినిచూచి వారితో సంభాషించి యున్నందువల్ల మాకాసంగతి బాగా తెలుసును. పాత తెలుగు మాటలు కొన్ని, కొత్తవికొన్ని అరవమాటలు కొన్ని కలిపి చిత్రమైన ఏసతోను, స్వరములోను వారు 'మాట్లాడుతారు *కొంత పరిచయము కుదిరేవరకూ వారి మనోభావము స్పష్టముకాదు. ఇట్టి తెలుగు వ్యావహారిక భాషగాగలవారు తెలుగు పండితులుగా ఉంటే వారు రచించే గ్రంథములు ప్రాచీన కావ్యముల శైలిని కాక మరియేలాగున వ్రాయగలరు? వేగినాడు, వెలనాడు, పాకనాడు, కమ్మనాడు, పల్నాడు మొదలయిన నాళ్ళునిజమయిన తెలుగు దేశములోనివి. ఇక్కడివారు వందలు వందలు వ్రాసిపెట్టినారు గ్రంథాలు నానావిధములయినవిన్నీ. అందులో మీదనుచెప్పినట్లు ప్రబంధాలన్నీ కావ్య భాషలోనున్ను, వచనగ్రంథాలన్నీ వ్యావహారిక భాషలో నున్ను ఉన్నవి.

ఇదీ తెలుగుదేశములో మొన్న మొన్నటివరకూ సంప్రదాయము. పెద్దనగారు మనుచరిత్ర వ్రాసినట్లు కావ్యభాషలో వ్రాయించక వ్యావహారిక భాషలో వ్రాయించినారు తమ దానశాసనములు. కృష్ణదేవరాయలవారి ధర్మశాసనములు వాడుక భాషలోఉన్నవి గాని ఆముక్తమాల్యద వలె కావ్యభాషలో లేవు. శ్రీ సకల కవితా స్వతంత్రభట్టారక యొలకూచి బాల

---

* తంజావూరి గ్రంథాలయములో అరవైకంటె అధికముగా తెలుగు నాటకాలున్నవి. వాటిలో స్పష్టముగా కనబడుతుంది అరవతెలుగు ఎట్టిదో.

...ARTIA ... HYD

విన్నపము

సరస్వతీ మహా మహోపాధ్యాయులవారే తమ ప్రబంధములు కావ్యభాషలో వ్రాసి, ఆంధ్రశబ్ద చింతామణికి టీక వ్యావహారిక భాషలో వ్రాసినారు. అప్పకవివంటి లాక్షణికుడు తన లక్షణ గ్రంథములలో పద్యాలన్నీ కావ్యభాషలో వ్రాసినా అవతారికలు, వ్యాఖ్యలు, టీకలు మొదలయిన వచనములన్నీ,— ఒకటీ రెండూ కాదు, వందలున్నవి — వ్యావహారిక భాషలో వ్రాసినాడు. అచ్చుపడ్డ అప్పకవీయమందు 1859 వ సం॥ లో పరిష్కర్తలు ఈ వచనములోని వాడుకభాష కావ్యభాషగామార్చివేసినారు. *ఇట్లే భారతము లక్ష్మీపతిగారు భారతమునకున్నూ ముద్దరాజు రామన్న రాఘవ పాండవీయమునకున్నూ, చిత్రకవి అనంతుడు హరిశ్చంద్ర నళీయమునకున్నూ, సోమనాథ పండితుడు, జూలూరు అప్పయపంతులు, శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి మొదలయినవారు వసుచరిత్రకున్నూ వ్యావహారికభాషలో టీకలు వ్రాసినారు. అనేక వ్రాతపుస్తకములు దేశమందున్నవి. వందల కొలదిగా పండితులు, కవులు, రాజులు, మంత్రులు, సేనాపతులు మొదలయిన వారు వాడుక మాటలలో వ్రాసిన వ్రాతలు ప్రచురముగా మాకంటికి కనబడడముచేత ఈ విషయమందు మాకు దృఢమైన విశ్వాసము కలిగి, వాస్తవమయిన సంప్రదాయము లోకములో బహిరంగముగా ప్రకటించడము మంచిది అని తోచి ఈ పత్రికాముఖమున విజ్ఞప్తి చేయడమునకు సాహసించినాము.

ఇంకొక్కమాట. తెలుగువారివిద్య, వారిభాష, వారి సారస్వతము— వీటిని గురించేకాని యితరవిషయములజోలికి మేము పోము. తెలుగువారి విద్యకు ఆటంకములు కాకుండా ఉంటే రాచకార్యములతో గాని, మతముతో గాని, జాతితో గాని, మరి దేనితో గాని, మాకు పనిలేదు. భాషా

---

* అప్పకవీయము వ్రాతప్రతులు ఇరువై చూచి ఉన్నాము అన్నిటిలోనూ మేము చెప్పినట్లే వచనములున్నవి. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములో మ॥కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారు చెప్పినది చూడవచ్చును.

సారస్వతముల విచారణలోనైనా సత్యమందే మాకు పట్టుదల గాని, వాదుల యెడలను ప్రతివాదుల యెడలను ద్వేష ముండదు; అందరున్ను మిత్రులే. ఇది మా సంకల్పము.

రాబోయే సంచికలలో మేము విచారించదలచుకొన్న విషయములు:—
(1) తెలుగుమాటల సాధుత్వాసాధుత్వముల నిర్ణయము. అసాధువులనుకొన్న అనేక శబ్దములు సాధువు లనుకొనుటకు ప్రమాణములు. (2) నన్నయ భారతములోని పదముల పట్టిక. (3) తెలుగు పదముల రూపాంతరములు. (4) సంస్కృతపదముల రూపాంతరములు. (5) అంత్యవర్ణములనుబట్టి (అకారాంతాదిగా) ఏర్పరచిన తెలుగుమాటల పట్టిక. (6) గ్రంథములలో పాఠాంతరములు. (7) తెలుగుభాషాచరిత్రమునకు కావలసిన సామగ్రి. (8) నేటి తెలుగుభాషకు లక్షణము ఏర్పరచుటకు కావలసిన సామగ్రి. (9) మన పూర్వులు వ్రాసిన వచనరచనకు ఉదాహరణములు. (10) తెలుగులో చేరిన అన్యదేశ్యములు. (11) తెలుగుమాటల వ్యుత్పత్తి. (12) తెలుగు నిఘంటువులలోని లోపములు (13) తెలుగు వ్యాకరణములలోని లోపములు. (14) తెలుగుఛందస్సు. (15) దేశము, జాతి, వృత్తి మొదలయిన వాటిలో భేదమునుబట్టి తెలుగుభాషలో కలిగిన భేదములు. (16) సర్వజన సామాన్యమైన విషయములు బోధించే పుస్తకములు. (17) నేడు తెలుగు గ్రంథములలో వాడుతూఉన్న భాష. (18) సారస్వత విమర్శ. (19) భాషాతత్త్వము. (20) అన్యదేశముల సారస్వతము. (21) విద్యాభివృద్ధి.

బ్రహ్మాండమంత పనిఏమిటి! చిన్నచీమలవంటి మేమేమిటి! ఎంత సాహసము! అని భయపడి, విముఖులమైఉంటే, మా మిత్రులు 'మీరు పని మొదలుపెట్టుతే, సాయంచేసేవారు లేకపోతారా? మీ వలెనే ఈ విషయములు విచారిస్తున్నవారు కొంద రున్నారు. ఒకరికొకరు తోడ

యితే పని సాగకపోదు” అని పురికొల్పినారు. సదుద్దేశముతో చేయ బూనుకొన్న ఈ పని నెరవేరేటట్టుగా తెలుగువారున్నూ తెలుగువారి అభివృద్ధిని కోరే యితరులున్నూ మాకు యథాశక్తి సాయము చేయుదురుగాక అని మిక్కిలి వినయముతో ప్రార్థిస్తున్నాము.